నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, గురువారం 14 మార్చి 2024 | HYDERABAD

ఎస్టీపీల పరిశీలన

సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : జలమండలి చేపడుతున్న ఎస్టీపీ ప్రాజెక్టులో భాగంగా నాగోల్, అంబర్‌పేటలో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి కేంద్రాల్ని ఎండీ సుదర్శన్‌రెడ్డి బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. మొదటగా నాగోల్ ఎస్టీపీ వెళ్లిన ఎండీ.. అక్కడి పనులపై అధికారులను వివరాలు ఆడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. తగినంత కార్మికులను ఏర్పాటు చేసుకోవాలని ఎండీ సుదర్శన్ రెడ్డి సూచించారు. సివిల్ పనులు పూర్తి చేసి ఎలక్ట్రో మెకానిక్ యంత్రాల బిగింపు పనుల్ని వేగవంతం చేయాలని ఆదేశించారు.

డ్రోన్లపై నిషేధం

సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ): ప్రధాని పర్యటన సందర్భంగా శుక్రవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్రోన్లు, పరాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్డ్ మైక్రో లైట్ ఎయిర్ క్రాఫ్ట్స్, ఎయిర్ బెలూన్లపై నిషేధం విధిస్తున్నట్లు కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. 15న ప్రధాని నరేంద్రమోదీ మల్కాజిగిరిలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో డ్రోన్లపై నిషేధం విధిస్తునట్లు సీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

3 నెలల్లోనే రూ.2563 కోట్లు

సిటీబ్యూరో: పాతనగరంలో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ సర్కారు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఎంజీబీఎస్-ఫలక్‌నుమా మెట్రో కారిడార్ నిర్మాణానికి రూ. 2వేల కోట్లతో చేపట్టే ప్రాజెక్టు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. యాకుత్‌పుర, చార్మినార్, బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రోడ్ల విస్తరణకు రూ. 200 కోట్లు కేటాయించగా, రెండు రోజుల కిందటే మీరాలం చెరువుపై నిర్మించే హై లెవల్ బ్రిడ్జి కోసం అవసరమైన రూ. 363 కోట్లకు పరిపాలన అనుమతులను ప్రభుత్వం ఇచ్చింది.

మార్పు వచ్చింది ట్యాంకర్ తెచ్చింది

మార్పు అంటూ.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్..తన మునుపటి 'మార్కు'ను చూపిస్తున్నది. కాంగ్రెస్ పాలనంటేనే నీటి కష్టాలు..కరెంటు వెతలు..అనేక ఇబ్బందులన్న విషయం తెలిసిందే. మళ్లాఆ పాతరోజులు గుర్తుకు వచ్చేలా..మార్చిలోనే గుక్కెడు నీటి కోసం ప్రజలు అల్లాడిపోవాల్సి వస్తున్నది. ఓయూ వద్ద జామై ఉస్మానియా ప్రాంతంలో ట్యాంకర్ నీటి కోసం ఆడబిడ్డలు పడుతున్న తిప్పలను చిత్రంలో చూడొచ్చు.

ఈవీడీఎం పనితీరుపై మేయర్ ఆగ్రహం..

సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ ఈవీడీఎం విభాగం పనితీరుపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు హౌస్ కమిటీ సభ్యులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. పారిశుధ్యం నిర్వహణలో లోపాలను ఎత్తిచూపేందుకు, ప్రకటనల విభాగంలో అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు కౌన్సిల్ వేదికగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నీ పార్టీల కార్పొరేటర్లతో కలిసి రెండు వేర్వేరు హౌస్ కమిటీలు వేశారు. ఇందులో భాగంగానే బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పారిశుధ్యం ప్రకటనల విభాగంపై ఏర్పడిన కమిటీ సమావేశాలు రెండు వేర్వేరుగా మేయర్ అధ్యక్షతన జరిగాయి. పారిశుధ్యంపై హౌస్ కమిటీ సభ్యులు ఇచ్చిన ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానం లేకపోవడంతో వచ్చే 15 రోజుల్లోగా సమాధానాలతో వచ్చే సమావేశానికి రావాలని మేయర్ సూచించారు. ఇదే సమయంలో ప్రకటనల విభాగంపై హౌస్ కమిటీ సభ్యులు చర్చించాలనుకునే సమయానికి బాధ్యులైన ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో మేయర్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రకటన విభాగం అడహక్ కమిటీ బాధ్యులు ఏఎంసీకి కమిషనర్ ఇచ్చారని సదరు డైరెక్టర్ మేయర్‌కు వివరించారు. దీంతో కమిటీ సభ్యులు ప్రకటనల విభాగంలో జరుగుతున్న తంతుపై మరోసారి విరుచుకుపడ్డారు. కౌన్సిల్‌లో హౌస్ కమిటీ ఏర్పడిన తర్వాత ఏకపక్షంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.కార్తిక్‌పై ఎలాంటి విచారణ లేకుండా బదిలీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. విచారణాధికారి ప్రత్యేక అధికారిని ఎందుకు నియమించలేదని మండిపడ్డారు. కమిటీ విచారణలోకి రాకుండానే నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయంటూ ప్రకటనల బోర్డులు, హోర్డింగ్‌లను ఎందుకు తీయాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే 15 రోజుల్లో కమిటీ సభ్యులు ఇచ్చిన ప్రతి ప్రశ్నకు సమాధానాలతో అధికారులు రావాలని మేయర్ ఆదేశించారు.

పర్యావరణం కోసం సైకిల్ యాత్ర

సిటీబ్యూరో: పర్యావరణ పరిరక్షణ అవగాహన కల్పించడమే లక్ష్యంగా మిజోరాంకు చెందిన వాన్‌లాల్లాజూలా వరే సైకిల్‌పై దేశ యాత్రకు బయలుదేరారు. కార్బన్ ఫుట్ ప్రింటింగ్ తగ్గించాలని, వాయు కాలుష్య తీవ్రతను తగ్గించాలంటూ అవగాహన కల్పిస్తూ.. హైదరాబాద్ చేరుకున్న సైక్లిస్ట్ వాన్‌లాల్లాజూలా వర్టేకు పర్యావరణ నియంత్రణ మండలి ఘనంగా స్వాగతం పలికింది. హబ్సీగూడలోని జ్ఞాన్ భారతి పాఠశాలలో పర్యావరణ ప్రాముఖ్యత, దేశవాళీ సైకిల్ యాత్ర ఉద్దేశ్యాన్ని విద్యార్థులకు వర్టే వివరించారు. రైడ్ టూ క్లీన్ ఎయిర్ కార్యక్రమాన్ని జనవరిలో ప్రారంభించి వాయుకాలుష్యం నియంత్రణపై పౌర సమాజానికి అవగాహన కల్పించడమే యాత్ర ప్రధాన ఉద్దేశమన్నారు. పర్యావరణహితమైన రవాణా సదుపాయాలను వినియోగించాలన్నారు. ఈ మేరకు కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ సైంటిస్ట్ ప్రసన్న కుమార్ వర్టేను సన్మానించారు.

ఎవరికి చెప్పుకుంటావో చెప్పకో..

బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్‌పై అమానుషంగా దాడి

జూబ్లీహిల్స్‌లో మరోసారి కాంగ్రెస్ 'రౌడీ' రాజకీయం

బంజారాహిల్స్/వెంగళరావునగర్ మార్చి 13: 'సీఐకి ఫోన్ చేసుకుంటావో.. ఎమ్మెల్యేకు ఫోన్ చేసుకుంటావో చేసుకో.. ఇది మా ప్రభుత్వం.. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో'..అంటూ.. బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్‌పై అమానుషంగా దాడి పాల్పడ్డారు కాంగ్రెస్ నాయకులు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మరోసారి కాంగ్రెస్ మార్క్ రౌడీ రాజకీయం వెలుగులోకి వచ్చింది. పదిరోజుల కిందట బీఆర్ఎస్ కార్యకర్తలను కిడ్నాప్ చేసి విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన మరువకముందే ఏకంగా ఈసారి పార్టీకి చెందిన మహిళా కార్పొరేటర్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు పక్కా ప్రణాళికతో దాడికి పాల్పడటం కలకలం రేపింది. యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్ డివిజన్ల పరిధిలో ప్రధాన రహదారులతో పాటు పలు ప్రాంతాల్లో రెండునెలలుగా కాంగ్రెస్ నాయకులు నవీన్‌యాదవ్, వెంకట్‌యాదవ్ ఇష్టారాజ్యంగా పెద్దపెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నెలల తరబడి ఫ్లెక్సీలు పెట్టడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గతంలో ఫ్లెక్సీలు పెడితే రెండుమూడు రోజుల్లోనే తొలగించే జీహెచ్ఎంసీ సిబ్బంది నిర్లక్ష్యంగా వహిస్తున్నారంటూ.. స్థానికులు వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్యకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం కార్పొరేటర్ దేదీప్య జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానికులకు ఇబ్బందులు కలిగించేలా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించేందుకు సిబ్బంది యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్దకు వచ్చారు. కాగా, ఫ్లెక్సీలు తొలగించనున్నారన్న సమాచారంతో కాంగ్రెస్ నాయకులు నవీన్ యాదవ్ సోదరుడు వెంకట్ యాదవ్‌తో పాటు పలువురు మహిళలు అక్కడికి చేరుకుని వారితో వాగ్వాదానికి దిగారు. తమకు స్థానిక కార్పొరేటర్ దేదీప్య ఫిర్యాదు చేయడంతో ఫ్లెక్సీలు తొలగించేందుకు వచ్చామంటూ డీఆర్ఎఫ్ సిబ్బంది చెప్పడంతో పాటు ఆమెకు ఫోన్ చేసి వెంటనే అక్కడకు రావాలని కోరారు. కాసేపటి తర్వాత భర్త విజయ్, పీఏ ఫయూమ్‌తో కలిసి కారులో దేదీప్య అక్కడకు చేరుకున్నారు. ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం అప్పటికే సుమారు 30 నుంచి 40 మంది మహిళలు కారును అడ్డుకోవడంతో పాటు తీవ్ర పదజాలంతో దూషించడం ప్రారంభించారు. దీంతో కార్పొరేటర్ దేదీప్యకు, కాంగ్రెస్ మహిళా కార్యకర్తలకు వాగ్వాదం ప్రారంభమైంది. సమస్య గురించి మాట్లాడుతుండగానే భావన, నాగలక్ష్మి, లక్ష్మి తదితర మహిళలు కారులో ఉన్న కార్పొరేటర్ దేదీప్యపై దాడికి దిగారు. అంతటితో ఆగకుండా ఆమెను కారులోంచి బయటకు లాగేందుకు ప్రయత్నించడంతో పాటు ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. 'సీఐకి ఫోన్ చేసుకుంటావో.. ఎమ్మెల్యేకు ఫోన్ చేసుకుంటావో చేసుకో.. ' అంటూ తీవ్రస్థాయిలో బూతులు తిట్టారు. ఫోన్ లాక్కుని పారవేశారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ నేత వెంకట్ యాదవ్‌తో పాటు అతడి అనుచరులు దాడి ఘటనను వీడియోలు తీయడంతో పాటు వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేశారు. సుమారు 20 నిమిషాల పాటు కారును ముందుకు వెళ్లకుండా దాడికి పాల్పడటంతో కార్పొరేటర్ దేదీప్యకు తీవ్ర గాయాలయ్యాయి. జరిగిన సంఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులకు దేదీప్య భర్త విజయ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాధితులపైనే కేసు నమోదు..

ఇదిలా ఉండగా పక్కా ప్రణాళికతో కార్పొరేటర్ దేదీప్యరావుపై దాడి చేసిన మహిళలు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమ మీదనే కార్పొరేటర్ దాడి చేశారని, అసభ్యంగా మాట్లాడారని ఫిర్యాదు చేశారు. తాము కేవలం మాట్లాడుతుండగా తమపై దాడి చేశారని, తోసేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో దాడికి గురైన కార్పొరేటర్‌తో పాటు ఆమె భర్త విజయ్, పీఏ ఫయూమ్‌లపై జూబ్లీహిల్స్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తమ మీదనే దాడి జరిగినా.. తమపైనే కేసు పెట్టడం ఏమిటని కార్పొరేటర్ దేదీప్యరావు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, కార్పొరేటర్ దేదీప్యరావును ఎమ్మెల్యే మాగంట గోపీనాథ్, కార్పొరేటర్లు వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, మన్నె కవిత పరామర్శించారు.



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి వివరాలు వెల్లడిస్తున్న కార్పొరేటర్ దేదీప్యరావు, చిత్రంలో కార్పొరేటర్లు వనం సంగీతాశ్రీనివాస్ యాదవ్, మన్నె కవితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి

దాడి అమానుషం

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

మహిళా ప్రజా ప్రతినిధి,వెంగళరావు నగర్ కార్పొరేటర్ దేదీప్య రావు పై దాడి అమానుషం.పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో మేము ఏనాడూ రౌడీయిజం, గుండాలను ప్రోత్సహించలేదు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా మా ప్రభుత్వం పనిచేసింది. కొత్తగా కాంగ్రెస్ అధికారంలో వచ్చిన ఈ మూడు నెలల్లోనే ఇంతటి దౌర్జన్యానికి పాల్పడ్డారు. కాంగ్రెస్ గుండాగిరికి ఇది పరాకాష్ట. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

మద్యం మత్తులో మహిళలు దాడి చేశారు

బీఆర్ఎస్ కార్పొరేటర్ దేదీప్య

నాపై కాంగ్రెస్ పార్టీకి చెందిన నవీన్ యాదవ్ అనుచరులైన ఆ మహిళలు మద్యం మత్తులో దుర్భాషలాడుతూ.. దాడి చేసి గాయపరిచారు. 'ఇది మా ప్రభుత్వం..ఎవరికీ చెప్పుకుంటావో చెప్పుకో..మీ ఎమ్మెల్యే కూడా ఏం చేయలేడ'ంటూ మద్యం మత్తులో ఉన్న మహిళలు దాడికి పాల్పడ్డారు. జూబ్లీహిల్స్ పోలీసులకు ఫోన్ చేసేందుకు ప్రయత్నించగా..సెల్ ఫోన్ ను లాక్కొని నేలకేసి కొట్టి పగులగొట్టారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 13 : పార్లమెంట్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఎన్నికల నోడల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో భాగమైన అన్ని విభాగాల నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండి.. ఎలాంటి లోపాలు తలెత్తకుండా తమ ఎన్నికల విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది డేటా నమోదు, అన్ని విభాగాల వారికి శిక్షణ పూర్తి చేయాలన్నారు. ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది రవాణాతో పాటు వాహనాలకు జీపీఎస్ విధానం అమర్చి.. వాటిని ట్రాక్ చేయాలని సూచించారు. ఎన్నికల ఖర్చు, ఎంసీఎంసీ కమిటీ ద్వారా పెయిడ్ న్యూస్, ప్రకటనల ఖర్చును వ్యయ నియంత్రణ కమిటీకి ఎప్పటికప్పుడు పంపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్ హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఎకరంలోపు బహుళ అంతస్తులకు అనుమతులు

మూడు నెలల తర్వాత పునరుద్ధరణ

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరంలో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ప్రధానంగా బహుళ అంతస్తులకు అనుమతులను పూర్తిగా నిలిపివేయడంతో బిల్డర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వారం రోజుల కిందట' నిర్మాణ రంగం కుదేల్- ప్రభుత్వం మారగానే నిలిచిన బడా నిర్మాణాల అనుమతులు' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన వార్తా కథనానికి సర్కారు స్పందించింది. ఎకరంలోపు ఉన్న స్థలంలో బహుళ అంతస్తులను నిర్మించేందుకు వచ్చిన అనుమతులను మంజూరుకు చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో ఎక్కువగా భవన నిర్మాణాలు జరిగే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాల అనుమతులను ఆయా శాఖల అధికారులు పునరుద్ధరించారు. దేశ రియల్ రంగంలో హైదరాబాద్ ముందు వరుసలో ఉండేది. గత కేసీఆర్ ప్రభుత్వం స్వతరమే భవన నిర్మాణ అనుమతులను ఇచ్చేందుకు టీఎస్ బీ పాస్‌ను తీసుకొచ్చింది. ఈ పాలసీతో ఎంతో పారదర్శకంగా, వేగంగా నిర్మాణ అనుమతులు వచ్చేవి. డిసెంబర్ నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు రావడంతోనే ఎంఎస్‌బీ కేటగిరీలో ఇచ్చే అనుమతులు మూడు నెలలుగా నిలిచిపోయాయి. దీంతో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న బిల్డర్లు ఎదురు చూస్తున్నారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీల్లో ఉన్నతాధికారులు మారినా... ప్రభుత్వం ఆయా శాఖల్లోని కీలక అంశాలపై సమీక్షలు చేసినా, భవన నిర్మాణం అనుమతుల విషయాన్ని పక్కన పెట్టారు. ఈ నేపథ్యంలోనే 'నమస్తే' కథనానికి స్పందించి..సర్కారు అనుమతులను పునరుద్ధరించడంపై బిల్డర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ. 26 కోట్లతో ఆర్వోబీలకు మరమ్మతులు

మరిన్ని చోట్ల జంక్షన్ల అభివృద్ధి

'బయో మెట్రిక్ అటెండెన్స్'కు ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్

బల్దియా 'స్టాండింగ్ కమిటీ'లో పలు కీలక నిర్ణయాలు



సమావేశంలో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్ రాస్ తదితరులు

సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. 16 అంశాలను ఆమోదించిన కమిటీ సభ్యులు.. పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బేగంపేట ఆర్వోబీ మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు రూ.20కోట్లతో పనులు, రామకృష్ణాపురం (సికింద్రాబాద్) రైల్వే స్టేషన్ వద్ద ఆర్‌కేపురం ఆర్వోబీ పునరుద్ధరణ చర్యలకు రూ. 6 కోట్ల పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. యూసుఫ్‌గూడ బస్తీ జంక్షన్ అభివృద్ధికి అంచనా రూ. 4.90 కోట్లకు, రహ్మత్‌నగర్ పీజీఆర్ విగ్రహం జంక్షన్ అభివృద్ధికి అంచనా వ్యయం రూ. 5.17 కోట్ల పనులకు కమిటీ ఆమోదం తెలిపింది.

మరిన్ని అంశాలివీ..

- జీహెచ్ఎంసీలో ఔట్‌సోర్సింగ్, రెగ్యులర్ సిబ్బంది హాజరు పరిశీలనకు మొబైల్ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ (ముఖగుర్తింపు) బయోమెట్రిక్ అటెండెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలు చేసేందుకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ఆహ్వానించేందుకు ఆమోదం.
- ఆర్‌సీపురం రాయ సముద్రం ట్యాంక్ మిషన్ కాకతీయలో భాగంగా ఇంటేక్-1 నుంచి ఇంటేక్-2 వరకు డ్రైనేజీ మళ్లింపు పనులు, ఇంటరాప్షన్ అండ్ డైవర్షన్ (ఐ అండ్ డీ)లు చేపట్టేందుకు రూ.2.52 లక్షల పనులకు టెండర్లు పిలిచేందుకు అనుమతి.
- అన్నపూర్ణ భోజన పథకానికి సంబంధించిన ఏజెన్సీ హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌తో ఒప్పందం పూర్తి అయినందున మరో రెండు సంవత్సరాల పొడగింపునకు ఎంవోయూ కుదుర్చుకునేందుకు కమిటీ ఆమోదించింది.
- బేగంపేట ఆర్వోబీ మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు రూ.20కోట్ల అంచనా ప్రతిపాదనకు పరిపాలన అనుమతికి కమిటీ ఆమోదం.
- రామకృష్ణాపురం (సికింద్రాబాద్) రైల్వే స్టేషన్ వద్ద ఆర్‌కేపురం ఆర్వోబీ పునరుద్ధరణకు రూ. 6 కోట్ల పనులకు పరిపాలన అనుమతికి ఆమోదం.
- ఎల్బీనగర్ నాలుగు జంక్షన్లలో ఎస్ఆర్‌డీపీ కింద చేపట్టిన ఫ్లై ఓవర్ల నిర్మాణానికి రివైజ్డ్ అంచనా వ్యయం మొత్తం రూ. 550కోట్లకు పరిపాలన ఆమోదం. అదనంగా రూ. 67 కోట్లు పెరిగినట్లు అధికారులు కమిటీ సభ్యులకు వివరించారు.
- యూసుఫ్‌గూడ, వెంగళ్‌రావు నగర్ డివిజన్‌లల్లో యూసుఫ్‌గూడ బస్తీ జంక్షన్ అభివృద్ధికి అంచనా రూ. 4.90 కోట్లకు పరిపాలన అనుమతికి ఈ-టెండర్లు పిలిచేందుకు అనుమతి.
- శేరిలింగంపల్లి సర్కిల్ 19 రహమత్ నగర్ పీజీఆర్ విగ్రహం జంక్షన్ అభివృద్ధికి అంచనా వ్యయం రూ. 5.17 కోట్లకు పరిపాలన అనుమతి.
- మూసాపేట సర్కిల్‌లో లూలూ ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సొంత నిధులతో ఇప్పటికే ఉన్న రహదారిని వెడల్పునకు ఆమోదం.
- బాలాజీ నగర్ నుంచి బీఎస్ఎన్ఎల్ ఓపెన్ ల్యాండ్ వరకు రూ. 599 లక్షల అంచనా వ్యయంతో చేపట్టే (బాక్స్ డ్రైన్) వరద నీటి కాలువ నిర్మాణానికి కమిటీ ఆమోదం.
- బంజారాహిల్స్‌లో వైకుంఠ మహాప్రస్థానం శ్మశాన వాటిక సీఎస్ఆర్ పద్ధతిలో మూడు సంవత్సరాల పాటు ఫీనిక్స్ ఫౌండేషన్ సంస్థతో ఎంవోయూ చేసుకునేందుకు కమిటీ అనుమతి ఇస్తూ ఆమోదం. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు మహమ్మద్ ముజఫర్ హుస్సేన్, ఫాహద్ బిన్ అబ్దుల్ బిన్ అబ్ధత్, మహ్మద్ ఖాదర్, పొడవు అర్చన, మహమ్మద్ నసీర్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

డబ్ల్యూటీఐటీసీ బృందం పర్యటన

వరల్డ్ తెలుగు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కౌన్సిల్ (డబ్ల్యూటీఐటీసీ) బృందం ఆఫ్రికా ఖండంలోని కింగ్‌డమ్ ఆఫ్ ఈశ్వతిని దేశంలో పర్యటించింది. ఈ సందర్భంగా డబ్ల్యూటీఐటీసీ చైర్మన్ సందీప్ మక్తల మాట్లాడుతూ ఐటీ రంగంలో ఎంతో ముందంజలో ఉన్న తెలుగు వారి నైపుణ్యాలను వినియోగించుకునేందుకు కింగ్‌డమ్ ఆఫ్ ఈశ్వతిని రాజు ఈశ్వతి 3, యువరాణి సిబు ద్లామిని, ఐటీ,వ్యవసాయ శాఖ మంత్రి మండ్ల చవుకేలు ఆసక్తి చూపారన్నారు. భారత దేశం ఇప్పటికే ఐటీ రంగంలో సేవలు అందిస్తుండటం, టెక్నాలజీ రంగంలో హైదరాబాద్ తనదైన ముద్ర వేసుకున్న నేపథ్యంలో తమతో టెక్నాలజీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారన్నారు.

– సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ)